# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## అందరూ నవ్వుతూ బ్రతకాలి

## రాజబాబు

### (విజయచిత్ర – 1975, అక్టోబర్ సంచిక నుంచీ)



డియర్ రీడర్స్ ...

మీ అందరికీ నా చీర్స్ !

ఈ నెల 20 వ తారీఖున – ముప్పైతొమ్మిది సంవత్సరాల క్రితం నేను పుట్టాను! పుట్టినప్పుడు నాకు తెలియదు. పోయేటప్పుడు కూడా నాకు తెలియదేమో – కానీ మీ అందరికీ తెలుస్తుంది. అదే నా అదృష్టం !

అదృష్టం అని ఎందుకన్నానంటే – అందరూ 'నవ్వుతూ బ్రతకాలి' అని అనుకుంటారు. ఏడుస్తూ బ్రతకాలని బ్రతకరు. అందుకే అందర్నీ నవ్వించేవాడే చాలా అదృష్టవంతుడు. కానీ నవ్వించేవాడు కూడా 'నవ్వాలి' అనుకుంటాడు. ఎప్పుడు? మీ అందరి నవ్వులూ చూసినప్పుడు! మీరలా హాయిగా నవ్వుకుంటూవుంటే ఆ నవ్వులే నా జీవితానికి తావీజు అనుకుంటాను. అవే నన్ను నవ్వుకోమని చెప్పడానికి మీరిచ్చే తాకీదు కూడా!

పుట్టి బ్రతకడం ఒక గొప్ప కాదు. పుట్టిన ప్రతి మనిషీ ఒక చరిత్ర సృష్టించుకోవాలి. అప్పుడే ఆ మనిషికి, దేశానికీ కూడా గౌరవం పెరుగుతుంది. ఈ మద్రాసు మహానగరంలో ఒకే ఒక మహానటుడికి ఓ పెద్ద శిలావిగ్రహం కట్టించారు. ఆ మహానటుడు సుప్రసిద్ధ తమిళ హాస్యనటుడు శ్రీ యన్. యస్. కృష్ణన్. తెలుగు వారికి కూడా ఆయన అపరిచితుడుకాడు. నేను అంత గొప్పనటుడిని కావాలని అనుకోకపోయినా, ఆయన కీర్తిలో నాలుగవ వంతైనా నాకు లభిస్తే, అదే చాలని తృప్తి పడతాను! ఆ ప్రయత్నంలోనే నా కృషిని కొనసాగిస్తాను.

నిజం చెప్పాలంటే – మనిషి బ్రతికి వుండగా 'మనిషి' అనిపించుకోవటం గొప్ప కాదు. మనిషి చనిపోయిన తర్వాత మనిషిగా బ్రతకడం చాలా గొప్ప. యన్. యస్. కృష్ణన్ గారు అలాంటి గొప్పను సంపాయించారు. అదీ విశేషం !

నాకు గతం ఎప్పుడూ జ్ఞాపకం ఉంటుంది. 'గతాన్ని మరచే మనుష్యులు చితి మీద పేర్చబడ్డ శవాలు' అనుకుంటాను. ఎంచేతంటే గతంలోంచి మనం నేర్చుకునే పాఠాలే మన ముందు జీవితానికి దారి చూపిస్తూ వుంటాయి.

మద్రాసులో యన్. యస్. కృష్ణన్ గారి శిలావిగ్రహం ఉన్న రోడ్డులోనే – ప్రముఖ నటీమణి రాజసులోచనగారి ఇల్లు ఉంది. ఆ ఇంటి మీదుగా ఎప్పుడైనా వెళ్ళినప్పుడు, అక్కడో తోటమాలి జ్ఞప్తికి వస్తాడు. (అతనిప్పుడు లేడు! ఉంటే నేను ఆనాటి 'ఫలానా మనిషి' ని అని చెప్పి నన్ను నేను పరిచయం చేసుకుని వుండేవాణ్ణి) నేను ఈ సినిమా రంగంలో అడుగుపెట్టడానికి వచ్చిన తొలి రోజుల్లో – ఓ మూడు రోజులు వరసగా నిరాహార దీక్ష చేయవలసి వచ్చింది. ఎవరూ వేషాలు ఇవ్వలేదని కాదు! డబ్బులివ్వనంత మాత్రాన ఈ హోటల్ వాళ్లు భోజనం ఎందుకు పెట్టరు అని వాళ్ళ మీద కోప్పడుతూ – నిరాహార దీక్ష చేశాను. అప్పుడు నాకు మంచినీళ్ళు సరఫరా చేసింది ఆ మహానుభావుడే!

ఆ విధంగానే – నన్ను మద్రాసు పంపిన రాజమండ్రి మిత్రుడు శ్రీ చిట్టిబాబు, నాకు ఆశ్రయమిచ్చిన వారణాసి వారబ్బాయి శ్రీ చిట్టిబాబు, కొల్లూరి శాస్త్రి గారు, బొన్నాయన గారు --- ఇలా అందరూ మంచివారే నాకు స్నేహితులు ఆప్తులు కావడం, నన్ను క్లిష్ట సమయాల్లో ఆదుకుని నన్ను ముందుకు నడిపించడం నా అదృష్టంగా భావిస్తాను.

నేను నరసాపురంలో పుట్టాను. మండపేటలో కొంచెం పెరిగాను. కొంచెం చదువుకున్నాను. రాజమండ్రిలో ఎక్కువగా చదువుకుని, పెరిగి తిరిగాను. రాజమండ్రి అంటే నాకో ప్రత్యేకమైన అభిమానం ఉంది. నా 'కామిక్కులు' – నా మాటలు – నవ్వించగలవన్న ఆత్మ విశ్వాసం నాకు అక్కడే కలిగింది. అక్కడి రిక్షా కార్మికులు కూడా నేనన్నా, నా హాస్యమన్నా చాలా ముచ్చట పడేవారు. నా 'వేషాలు' అవీ చూసి – నన్ను సినిమాల్లో ప్రయత్నించమని చెప్పిందీ అక్కడి మిత్రులే. మద్రాసులో సినిమా అవకాశాల కోసం ప్రయత్నించడంలో ఉపయోగ పడతాయని 'బాబూ ఫోటో స్టూడియో' మిత్రులు శ్రీ బాబూరావు, శ్రీ నవాబ్ జాన్ నా ఫోటోలు తీశారు. ఈ సంఘటనలన్నీ నేనెలా మరచి పోగలను?

నేను 1960 ఫిబ్రవరి ఏడవ తారీఖున మద్రాసులో అడుగుపెట్టాను. ఆ మర్నాడే ప్రసిద్ద సంగీత దర్శకులు శ్రీ రాజేశ్వరరావుగారి బావమరిది గారి పెళ్ళి ఫంక్షన్ లో 'మిమిక్రీ' చేశాను. మిమిక్రీ ఛాన్సు సంపాయించినంత తేలిగ్గా సినిమా ఛాన్సు వస్తుందా? రాలేదు, ఎన్నో ప్రయత్నాలు --- ప్రయత్నాల మీద ప్రయత్నాలు చేశాను. నేనాలాగూ అంతకుముందు స్కూలు మాస్టర్ నే కాబట్టి – నటులు, దర్శకులు అయిన శ్రీ అడ్డాల నారాయణ రావుగారి పిల్లలకు కొన్నాళ్ళు 'ట్యూషన్' చెప్పాను. వారు డైరెక్టు చేసిన 'సమాజం' చిత్రం లోనే నేను తొలిసారి వేషం వేశాను. నిజానికి వాళ్ళ ఇంట్లో ట్యూషన్లు చెప్పే మాస్టారే ఆ చిత్రంలో వేషం వేసినట్లు – అడ్డాల నారాయణ రావుగారికి అప్పట్లో తెలిసి కూడా ఉండదు. అంత చిన్న వేషం – కానీ అదే నేను నటించిన మొదటి చిత్రం!

ఆంధ్రా ఆర్ట్ నాటక సంస్థ స్థాపకులు ప్రముఖ నటులు శ్రీ రావికొండలరావుగారు, కీ. శే. డాక్టర్ రాజారావుగారు – నన్ను నటుడిగా అందరికీ తెలిసేలా చేశారు. కొండలరావుగారి 'కుక్కపిల్ల దొరికింది', 'నాలుగిళ్ళ చావిడి' నాటకాలు. డాక్టర్ రాజారావుగారు ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' నన్ను కొంతవరకూ వెలుగులోకి తెచ్చాయి. (మాట వచ్చింది కాబట్టి చెప్పాలి – నా తొలి నాటకం 'మొద్దబ్బాయి' నా ఎనిమిదవ యేటే మండపేటలో వేశాను. అందులో ప్రేక్షకుల మెప్పుకోళ్ళు, మా నాన్న గారి చేత తన్నులూ కూడా తిన్నానుకోండి).

'సమాజం' తర్వాత 'స్వర్ణ గౌరి', 'తండ్రులు కొడుకులు', 'కులగోత్రాలు' మొదలైనవి నా ఆరంభ దశలోని చిత్రాలు. 'తోటలోపిల్ల – కోటలో రాణి' చిత్రంలో ప్రధాన హాస్యపాత్ర ధరించాను. ప్రసిద్ధ నటి వాణిశ్రీగారి మేకప్ మెన్ శ్రీ మాధవయ్య గారు 'వరలక్ష్మీ వ్రతం' చిత్రంలో వేషం ఇప్పించడానికి నన్ను సుప్రసిద్ధ నిర్మాత దర్శకుడు శ్రీ విఠలాచార్యగారి దగ్గరకు తీసుకు వెళ్ళారు. అప్పుడు విఠలాచార్యగారు నాకు మూడు వందల ఏభై రూపాయలకు చెక్కు

అడ్వాన్సుగా ఇచ్చారు. అదే నేను తొలిసారిగా తీసుకున్న చెక్కు! చెక్కు తీసుకున్నానే కాని అందులో నేను వేషం వేయనేలేదు! (మరోలా అనుకోకండి! కాల్ షీట్ కుదరకపోవడం వల్ల అలా జరిగింది!) జగపతి అధినేత శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్ గారు 'అంతస్తులు' చిత్రంలో నన్ను వేషం వెయ్యమన్నారు. "మరి ---. తమరు వెయ్యి రూపాయలు ఇస్తారా?" అన్నాను. (లోలోపల కాస్త జంకుతూనే!) ఆయన నవ్వుతూ నాకు పదమూడువందల రూపాయలు ఇచ్చారు. అంతే! అప్పటినుంచీ ఇక నేను వెనక్కి తిరిగి చూడడం అంటూ జరగలేదు!

నా తొలిరోజుల గురించే నేనెందుకు చెబుతున్నానంటే, ఆనాటి నా జీవితం, నా ఆశలు, నిరాశలు, నా జీవితంలో ప్రవేశించిన హితులు --- సన్నిహితులు ---. ఆ సంఘటనల నుంచి – నన్ను నేను వేరుచేసుకుంటే --- 'నే నెవర్ని' అన్న ప్రశ్న నాకు ఎదురుగా ప్రత్యక్షమవుతూ వుంటుంది.

నా జీవితంలో మరో ముఖ్యమైన మలుపు – నా ప్రేమ వివాహం – చి॥ లక్ష్మీ అమ్ములుతో --- నా జీవితంలో ఆ అదృష్టదేవత '65 – డిసెంబర్ 3 వ తేదీన ప్రవేశించింది. మాకు ఇద్దరు చిరంజీవులు నాగేంద్రబాబు, మహేష్ బాబు.

నా సినిమా జీవితంలో నేను ముఖ్యంగా చెప్పుకోవలసిన చిత్రాలు – 'సర్కార్ ఎక్స్ ప్రెస్', 'తిరపతి', 'ఎవరికివారే యమునాతీరే' మొదలైనవి.

'తిరపతి', 'ఎవరికి వారే యమునాతీరే' చిత్రాలు అనగానే, నాకో విషయం చెప్పాలనిపిస్తూ వుంది. నేను ముందే అన్నాను – మీ నవ్వులే నాకు బలాన్నిచ్చేవి అని! ఆ బలం నాలో ఉన్నంతవరకు మిమ్మల్ని నవ్విస్తూనే ఉంటాను. ఐతే – ఈ మధ్య ఒక పొరబాటు చేశాను. అదే నేను ట్రాజెడీ వేషాలు వేయడం! అలా నా ఆరోగ్యాన్ని కూడా కోల్పోయాను. నన్ను చూసి – మీరు నవ్వుకోవాలని వస్తారు. కానీ నా ట్రాజెడీ వేషం చూసి – కంట తడి పెట్టుకుంటూ వెళ్తారు. మీ కంట తడి నేను చూడలేదు. అందుకే ఒక నిర్ణయానికి వచ్చాను. ఇక పై సాధ్యమైనంతవరకు ట్రాజెడీ వేషాలు వేయకూడదని! మిమ్మల్ని ఎప్పుడూ నవ్విస్తూ, ఆరోగ్యవంతుల్ని చేయాలన్నదే నా కోరిక! నా ఆశ! ఆ ఆశే నా చేత టాబ్లెట్ మింగిస్తుంది --- బలం కోసం -------..

ఇప్పటికి నేను 305 చిత్రాల వరకూ నటించాను. దాదాపు తెలుగు చిత్రసీమలో ఉన్న హాస్య నటీమణులందరితోనూ, తారలందరితోనూ, నటించాను. పద్నాలుగు సంవత్సరాలలో ఇన్ని చిత్రాలు 'రికార్డ్' అనుకుంటాను. ఐతే నేను ఇప్పుడు నిజంగా సుఖంగా వున్నానా ? అనుకుంటే సమాధానం సూటిగా నాకేరాదు! బిజీ లైఫ్ --- ఒకటే బిజీ --- నన్ను గురించి నేను ఆలోచించుకోడానికి కూడా టైము లేదు! ఒకప్పుడు తక్కువ బియ్యంతో ఆహారం ఎక్కువ ఆరోగ్యకరంగా వుండేది. ఇప్పుడు --- ఎన్ని ఆహారపదార్థాలు, విటమిన్ టాబ్లెట్లు తిన్నా --- ఏం లాభం? అందుకే నేను రాసుకున్నాను. "కష్టంలో సుఖం కనబడుతుంది. ఐతే సుఖంలోనే ఎక్కువ కష్టం కనబడుతుంది. అదే అసలైన మనిషి జీవితం!" అని ! ఐనా నవ్వుతూ, నవ్విస్తూ బ్రతకాలనే నా ఆశలో ఏ మార్పూలేదు – రాదు!

కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు. వయసు వృద్ధాప్యాన్ని నా మీదకు అలవంతంగా నెట్టేస్తూంది. డైరీలో పేజీలు తిరిగిపోతున్నాయి. ఆఖరి పేజీ దగ్గర పడిపోతుందేమోనన్న భయం --- ఆ భయంతోనే ఈ మధ్య కాలంలో – మధ్య పేజీల్లో కొన్ని మంచి పనులయినా రాసుకోవాలన్న తపన ఎక్కువైపోతూ వుంది. ఆ తపనే నా చేత రాజ్ బాబు పబ్లిక్ ట్రస్ట్ ఏర్పాటు చేయించింది. నాకు చేతనైన సహాయం చేయాలనీ, కొందరినైనా ఆదుకోవాలనీ నా ఆరాటం. మీ అందరి సలహా సహకారాలతో ట్రస్ట్ – వృద్ధి చెంది, పదిమందికీ సహాయకారి అయితే – నా ఆఖరి పేజీ గురించి నేను భయపడవలసిన అవసరం లేదు!

నా స్నేహితులెందరో – బ్రతుకుతో పోటీ పడలేదు, కావాలని ఆఖరి పేజీ వెదుక్కుంటున్నారు. నాకు తెలుసు. నేను అందరికీ సహాయం చేయలేకపోతున్నాననే అలమటిస్తున్నాను. అందరినీ ఆదుకునే శక్తి నాకు లేదు. శక్తి మేరకు సహాయం చేస్తున్నా, ఎందరెందరో చిక్కుకున్నప్పుడు ఏం చేయగలం – బాధలు బరువుగా కనపడవచ్చు – అయితే వాటిని బాధ్యతలుగా తీసుకుంటే అవి తేలికవుతాయి. 'టేక్ ఇట్ ఈజీ' అనుకుని బ్రతకాలి మరి!

నేను చాలా చిన్న వాడిని. పెద్దలెందరో చేయూతనిచ్చి – నన్నీ స్థానంలో నిలబెట్టారు. ఇవాళ నేనీ స్థితిలో ఉన్నానంటే అందుకు కారకులు ఎవరో కాదు ---. మీరే ---. నా నిర్మాతలు ---. నా దర్శకులు --- సాంకేతిక నిపుణులూ --- నా తోటి నటీనటులేనని నాకు తెలుసు. వారందరికీ నేనెప్పుడూ కృతజ్ఞుడ్ని.

నా పుట్టినరోజు – ఏ ప్రయోజనమూ లేకుండా జరగడం నాకెందుకో అసంతృప్తికరంగా తోచింది. అందుకే ప్రతిసారి కొందరు పెద్దలను సన్మానిస్తున్నాను. కొన్ని నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా కొత్త నటులు పరిశ్రమలోకి వచ్చే అవకాశాలకు దోహదం – చేస్తున్నాను ---నేను ఈ సినిమా రంగంలో నటుడిగా రావాలనుకోవడానికి 'పాతాళ భైరవి' చిత్రంలో ప్రముఖ హాస్యనటులు శ్రీ బాలకృష్ణగారి నటన చాలా ప్రభావాన్ని చూపింది. ఆ

చిత్రం కనీసం నేను తొంభైసార్లన్నా చూసి వుంటాను. వారి పట్ల నా గౌరవం ప్రకటిస్తూ నా పుట్టిన రోజు సందర్భంగా – సన్మానం చేసి కొన్నాళ్ళ క్రితం నా కృతజ్ఞతలు తెలుపుకున్నాను. ఆ విధంగానే మరో ప్రముఖ నటులు డాక్టర్ శివరామకృష్ణయ్య గారిని సన్మానించాను. ఈ సంవత్సరం కూడా నా పుట్టిన రోజు సందర్భంగా కొందరు ప్రముఖులను సన్మానించబోతున్నాను. మూడు రోజుల పాటు – నాటకాలు, నాటికలు ప్రదర్శింపజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాను – నేను ఏం చేసినా నాకంటే అందరిలోనూ ఎక్కువ మంచి ఉందనుకుని చేస్తుంటాను. ఎవరైనా బిరుదులిస్తామంటే వద్దని బ్రతిమాలతాను. 'బిరుదులిచ్చి – నేను కష్టపడి సంపాయించుకున్న నా పేరును మాత్రం పాడు చేయకండి' అంటాను! నేను కోరికలకు బానిసను కాకపోయినా నాకు కొన్ని కోరికలున్నాయి. ప్రపంచ పర్యటన చేయకపోయినా – జపాన్, అమెరికా, రష్యాలు కొంతవరకూ చూశాను. తక్కిన దేశాలూ చూస్తాననుకుంటాను.

భవిష్యత్తులో ఎప్పుడైనా నా కథను – నేనే డైరక్టు చేయాలని వుంది. అలా చేసినా చేయకపోయినా బాబ్ అండ్ బాబ్ రిక్రియేషన్స్ పేరుతో నా కథలు 'మనిషి రోడ్డున పడ్డాడు', 'సరస్వతీ – లక్ష్మి – బ్రహ్మ' 'సంఘం చేసిన బొమ్మలు' – చిత్రాలుగా నిర్మించాలన్న ఉద్దేశం ఉన్నది.

జీవితంలో అవకాశాలు వచ్చినా, రాకపోయినా నేను ఆశయాలు మాత్రం ధైర్యంగా పెంచుకుంటూ ముందుకుపోతాను. నాకు అంతగా భయం లేదు. మిత్రులతో నేను అంటూ వుంటాను – 'రోజూ భయపడుతూ బ్రతకవద్దు. బ్రతకాలని ధైర్యంగా బ్రతుకు ... అప్పుడు నీదీ ఒక బ్రతుకవుతుంది!'

మరి ఈ ఉత్తరం ఇక విరమించేస్తాను. ఐతే మిమ్మల్ని కలుసుకోడానికి దోహదం చేసే ఈ పరిశ్రమనుండి మాత్రం నేనప్పుడే విరమించను. టాటా ! మరోసారి మీ అందరికీ నా ఛీర్స్!

ఉంటాను మరి ...

మీ

రాజబాబు

COMMENTS